ఆలా కుర్చీమీద కూర్చుండి! ఇంతసేపూ కూర్చున్నది కుర్చీ కాదు. గోడకుర్చీ!" అంటూ ఇంకా ఇంకా ఫారమ్ యిస్తూ వున్న క్యూవంక చూస్తూ "వీళ్ళందఱివెనక యివితే 2½ తులాలే!" యని అనుకుంటూ నిష్క్రమించేడు.

ఎవరు? కలగలపుల రమణయ్యపంతులుగారు ఆయన ఆదాకా కూర్చున్నది కుర్చీకాదు! గోడకుర్చీ!

.... .... .... .... ....

# క్షౌరకల్యాణంలో కల్యాణం

పల్లెటూళ్ళల్లో పంటలు పచ్చగడ్డి మున్నైనవి ఎంత బాగా ఎదిగి ఏపుగావుంటే యంత మంచిదని ప్రజలు తలపోస్తూ వుంటారు. కాబట్టి యక్కడివాళ్ళకు గడ్డాలు పెరిగినా తలకట్లు పొడుగ్గావున్నా కాతరుచేయరు. తగువులేదు. కాని పట్నవాసాల్లో యందులోను చెన్నపట్నంవంటి మహానగరంలో, నున్నని తార్రోడ్లు, తేటైన పింగాణీ గోడలు వున్న రాజధానీ ముఖ్యపట్నంలో ప్రతీ మగా ప్రతీ ఆడా టిప్‌టోగా, ట్రిమ్‌గా వుండాలనే ప్రయత్నం. ఆలా వెంట్రుక లేచిందీ యంటే ఇలా క్షౌరం చేయించుకు తీరాలిసిందే వ్యక్తి అయినవాడు! మఱి ఆడవాళ్ళకు మీసాలూ గడ్డాలూ యుండవుగాక! అయినా సెలూన్సుమీద "ఫర్ జెంట్స్ అండ్ లేడీస్" అని వ్రాయబడి వుంటుంది కాబట్టి ఆడవాండ్ల దృష్టి కూడా ఎందుకో అటే ఆకర్షింపబడుతూ వుంటుంది.

ఫాషన్: మనమంతా ఫాషన్‌కు బానిసలం. ప్రేమకోసం బైరాగులం. అంటే విరాగులం యన్నమాట కాదు. ఒకళ్ళ

నొకళ్ళం ప్రేమముషి అడుక్కునేవాళ్ళమన్నమాట. ఈ ప్రేమ ముషిలో మగవాని నున్నని గడ్డం, నున్నని పెదిమెలు స్త్రీ ఎంతగా కోరుతుందో, స్త్రీయొక్క గేరాగిరజా లంతగా మగవాడు కోరుతూంటాడు ఈ నవనాగరికవాతావరణంలో.

"అదిదా" కారణంగా "వన్ ఫైన్ మార్నింగ్" ఒకానొక షేవింగ్ సెలూన్‌లోకి "చక్రి" యనే యౌవన బ్రహ్మచారి మొదటిరోజున వెళ్ళాడు. వెళ్ళేముందు బోర్డుమీద "ఫర్ లేడీస్ అండ్ జెంట్సు" అన్నది "చూస్తూ కళ్యాణానికి "ఇంగె" యవకాశం వుంది" యని కూడా అనుకున్నాడు. కాని లోపల ఒక్క జెంటూ లేడు, ఒక్క లేడీ లేదు. సెలూన్ ప్రొప్రయిటర్ ఒక సోఫాకుర్చీలో కూర్చుని వార్తాపత్రిక చదువుకుంటూ ఒక కుట్టి మంగలికి కన్నుగీటాడు. వాడు చక్రిని ఒక పెద్ద అద్దం ఎదుట ఒక ఎత్తు సోఫో కుర్చీమీద కూర్చోపెట్టాడు. చక్రి యొక్క గడ్డానకు సోపూగీపూ రాశాడు. నున్నగా గీశాడు. వాడే చక్రినుండి పావులా వసూలుచేస్తూ పొమ్మన్నాడు. పోతూ చక్రి బోర్డుకేసి చూస్తూ "మతో జెంటూ లేడు, మతో లేడీ లేదే లోన" అని నసుక్కుంటూ వెళ్ళిపోయాడు.

అయినా ఒకనాడు చేయించుకున్న గడ్డం ఎన్నాళ్ళని నున్నగా వుంటుంది. మర్నాడే పెరిగింది చక్రికి గడ్డం చరచరా! మర్నాడూ ఆ సెలూన్‌కే వెళ్ళి చూచాడు "ట్రై ఎగెన్" అన్నట్టు. ఆనాడు మొదటికుర్చీమీద ఒక జెంట్ కూర్చుని ఉన్నాడు. చక్రికి మొదటరోజున గడ్డం గీసిన కుర్రాడు ఆ జెంట్‌కు నాడు గీస్తూ యున్నాడు. వెంటనే ప్రొప్రయిటరు చక్రికి రెండవకుర్చీ కాపరుస్తూ మతో ఎసిస్టాంటును పురమా

యించాడు. ఆ ఎసిస్టాంటు గబగబా యథా సెలూన్ శాస్త్రీయంగా షేవ్ చేస్తూ చక్రినుండి పావలా వసూలుచేస్తూ చక్రిని "వూడ్చు సామీ" అన్నాడు. చక్రి ఇలా ఆలా చూస్తూ స్వగతంగా "నో లేడీ?" యని అనుకుంటూ సైన్‌బోర్డుమీది వ్రాత హోక్సుగా భావించుకుంటూ వెళ్ళిపోయాడు. కాని టౌన్‌లో తిరిగేటప్పుడు కత్తిరింపు జుత్తులున్న మత్తకాశినులు వేనవేలు కానరావడం కద్దు. ఆ ముద్దియలందఱూ తమ తలకట్లెక్కడ డ్రెస్ చేయించుకోవడమా యనేదతని పరిశీలనయిపోయింది ఆ రోజల్లా. ఆ పరిశీలనలో మధ్యమధ్య ఆశ. మధ్యమధ్య నిరాశ.

మూడవనాడు కూడా ఎప్పట్లాగ తన గడ్డం పెరగడం చేత సెలూనుకు రావడం తప్పిందికాదు చక్రికి. రావడంతోపాటు ఆశ కొనలు సాగడం తప్పిందికాదు.

వింత! మూడవనాటి యుదయం అప్పటికప్పుడే సెలూన్ ఇద్దఱు జెంట్సుతో నిండివుంది. ఇద్దఱు ఎసిస్టెంట్సు వారితో ఎంగేజీ అయియున్నారు, ప్రొప్రయిటరు సంజ్ఞగా చక్రిని మూడో కుర్చీమీదకు తానే పిల్చి కూర్చోపెట్టి—మఱో ఎసిస్టాంటుకు ఒప్పజెబుతూ "అయ్యర్‌వాళ్ రోజురోజూ దయచేస్తూ ఉండారు. నిండాదయ మామీద" అన్నాడు.

చక్రి అద్దంలో చూచుకుంటూ తదేకదీక్షగా గడ్డంగీయించుకుంటూ ఉన్నాడు. గేటులో ఒక యువతి ప్రవేశమౌతూవున్న షూస్ చప్పుడయింది. ఆ సెలూన్‌లో ఉన్నవి మూడే అద్దాలు, మూడే కుర్చీలు, ప్రొప్రయిటరుకు కంగారెత్తుతూ ఉంది. ఒక్క జెంటూ క్షౌరం అయిపోయినా లేచిపోడే! అక్కడ కత్తిరించుమని

ఇక్కడ కత్తిరించుమని ఎదో కనుబొమ్మల్లో చెవులచెంతనో చూపించడమే! ఇంకా ఇంకా! చక్రికింకా సగం క్షౌరం అయినా కాలే!

"గుడ్‌మార్నింగ్ మాడెమ్!" అంటూ ప్రొప్రయిటర్ తాను స్వయంగా కత్తిరి సవరించేడు. ఆమెను కూర్చోబెట్టడానికి తావు లేదని లోలో చింతిస్తూన్నట్టు నటిస్తూ. ఆమె "నోమేటర్. ఐ కెన్ స్టేండ్ లైక్ దిస్. వెరీ అర్జంట్" అని తనకుదాను ఆమె–ఏమా చక్రి యదృష్టం!–చక్రి వెనకాల కుర్చీకి యని నిలబడింది. అద్దంలో తన ముఖం ప్రతిఫలించేలా! నడుమ నడుమ చక్రి ముఖబింబంతో కలిసిపోయేలా! ఒరసిపోయేలా! ఏమిటి? ఆమె ప్రతిఫలనం!

ప్రొప్రయిటరు ఆమె వెనుక పొంచుండి ఆమె పొడుగు పాటి జుత్తును గిరిజాల పరిమాణానికి కత్తిరిస్తూ "సారీ! మేడామ్! మిమ్మల్ని నిలబెట్టి కత్తిరించాలసి వచ్చినందుకు విచారిస్తూ ఉన్నాను" అన్నాడు.

"నో మేటర్! ఐ ఏమ్ ఆల్‌రైట్. మాకు ముందు మీసాలు గడ్డాలు వుండవు కాబట్టి ఈ పొసిషన్ ఏ అనుకూలం. వెనక జుత్తే కత్తిరించాలిసింది మాకు. ఇట్ ఈస్ ఆల్‌రైట్" అంది అమ్మందయాన మందస్మితయై, తప్పని సరిగా యలవరకు కొన్న ప్రిల్‌టోనుతో!

చక్రి అద్దంలో సాక్షాత్ క్షౌరకల్యాణం పరవశంగా యను భోగిస్తూ వెనక్కు తన రెండు చేతులూ మృదువుగా విసరి ఆమె మెడనే దండగా కలిపాడు! "క్షౌరకళ్యాణంలో కళ్యాణం" అన్నట్టు.

.... .... .... .... ....